క్లుప్తంగా

ఏలేశ్వరం ఎస్సైగా రామలింగేశ్వరరావు



ఏలేశ్వరం: స్థానిక ఎస్సైగా ఎస్.రామలింగేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తుని పోలీసుస్టేషన్ నుంచి ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై జి.సతీష్ బదిలీపై కిర్లంపూడి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై రామలింగేశ్వరరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి



పేరవరంలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో జ్యోతి

ఏలేశ్వరం: రైతులు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.జ్యోతి అన్నారు. పేరవరంలో సోమవారం ఆమె అధ్యక్షతన పంట నమోదుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తాము పండించిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలన్నారు. దీని నిమిత్తం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో కార్యక్రమం ప్రారంభించిందన్నారు. రైతులకు బీమా సౌకర్యం, పంటనష్టం అందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కర్రి సూర్యప్రకాష్, కర్రి సుబ్బారావు, అవసరాల సూర్యప్రకాష్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ధర్నా



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: మండలంలోని నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కారించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ వద్ద ధర్నా నిర్వహించి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మండలంలోని జె.అన్నవరం, పరిమితడక గ్రామాల్లో సుమారు 25 ఏళ్లగా గిరిజనులు సాగు చేస్తున్న కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వలేదన్నారు. జె.అన్నవరంలో సాగులో ఉన్న తొమ్మిది ఎకరాల భూమిని పేదలకు పంచాలన్నారు. తిరుమాలి గ్రామంలో అక్రమణలో ఉన్న భూదాన భూమిని దళితులకు పంచాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమాల కుశల, నాగులాపల్లి అర్జునుడు, గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి: ప్రయాణికుల సౌలభ్యం ఏలేశ్వరం డిపో నుంచి నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను సోమవరం గ్రామంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. సోమవారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం ప్రారంభించారు. ఈ బస్సు సోమవరం, ఇర్రిపాక, నరేంద్రపట్నం, జగ్గంపేట మీదుగా కాకినాడ వెళుతుందని తెలిపారు. నూతన ఆర్టీసీ బస్సు సర్వీసుతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

యువతి అదృశ్యం

గండేపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఏఎస్సై బి.చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. యల్లమిల్లి గ్రామానికి చెందిన తవిటికి మానస జూలై 22వ తేదీన అమలాపురంలో పరీక్షలు రాసేందుకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదన్నారు. ఆమె ఆచూకీ కోసం తల్లిదండ్రులు పలు చోట్ల వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో యువతి తల్లి లక్ష్మీదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

ట్రాఫిక్ టెన్షన్

- జగ్గంపేటలో హైవే బ్రిడ్జి వద్ద ఇరుకుగా ఉన్న రోడ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- ఇర్రిపాక, మర్రిపాక గ్రామాల ప్రజలకు రాంగ్ రూటే గతి
- తరచూ ప్రమాదాలు



జగ్గంపేట వెళ్లేందుకు రామవరం వద్ద రాంగ్‌రూట్‌లో తిరుగుతున్న వ్యాన్



జగ్గంపేటలో వంతెన పక్క సర్వీస్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో తిరగడానికి ఇబ్బంది పడుతున్న బస్సు

జగ్గంపేట: ఎప్పుడు రద్దీగా ఉండే జగ్గంపేట రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇరుకు రోడ్లు, పక్కనే చిరువ్యాపారాలు, రోడ్డుపైనే వాహనాల నిలిపివేతతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. గంట తరబడి నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డుపై వాహనాలు నిలిపివేయడంతో..

అన్ని గ్రామాలకు సెంటర్‌గా ఉండడంతో నిత్యం వేలాది మంది జగ్గంపేటకు వస్తుంటారు. ఇక్కడకు వచ్చిన ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో వంతెన ఏర్పాటు చేయక ముందు ఎంతో విశాలంగా, నాలుగు రోడ్ల కూడలిగా ఉండేది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరగడంతో వంతెన ఏర్పాటు చేసి నాలుగు లైన్ల జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 16)గా మార్పు చేశారు. ఈ వంతెనకు ఇరువైపులా వన్‌వే సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేశారు. ఇవి కూడా ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా ఈ సర్వీస్ రోడ్లలో బస్సులు, లారీలు, వ్యాన్లు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువైంది.

నిత్యం ప్రమాదాలే..

జగ్గంపేటలో హైవే బ్రిడ్జికి ఒక చివర జేవీఆర్ సెంటర్, మరో చివర ఆదిత్య హాస్పటల్ సెంటర్‌గా పిలుస్తారు. ఇక్కడ రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాలి. వంతెనకు ఈ చివర ఆ చివర ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఎందరో అంగవైకలానికి గురయ్యారు. ఇది చాలదన్నట్టు కొంతమంది చుట్టు తిరగలేక రాంగ్ రూట్‌లో వెళుతున్నారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో 3 ఏళ్లలో 119 మంది మృతి చెందారు. గత ఏడు నెలల్లో 35 మందికి పైగా మృతి చెందారంటే అక్కడ పరిస్థితి అర్థమవుతోంది.

మండలంలోని ఇర్రిపాక, మర్రిపాక నుంచి ప్రజలు నిత్యం రామవరం గ్రామం మీదగా జగ్గంపేట వస్తారు. రామవరం వద్ద జాతీయ రహదారి మీదకు చేరాక అక్కడ నుంచి రాంగ్‌రూట్‌లో 300 మీటర్ల దూరం వెళ్లాల్సిందే. ఈ రెండు గ్రామాల ప్రజలు హైవేకి రాకుండా వెళ్లేందుకు ఇరుకైన అండర్ పాస్ నిర్మించారు. పైగా దానికి సైడు రోడ్లు కూడా వేయలేదు. దీంతో రాంగ్‌రూట్‌లో వెళుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం 200 నుంచి 400 మందికి పైగా ప్రయాణిస్తుంటారు.

గత మూడు ఏళ్లలో జరిగిన ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతుల సంఖ్య	గాయపడినవారు
2022	84	37	64
2023	91	47	70
2024- (31-07-2024 వరకూ)	84	35	65

చర్యలు తీసుకుంటున్నాం



జగ్గంపేట, రామవరం వద్ద నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. ఇదే విషయాన్ని జాతీయ రహదారుల ఉన్నతాధికారులకు పలుమార్లు తెలియజేశాం. అయితే ఈ సమస్యలను తక్షణం పరిష్కరించడానికి అవకాశం లేదని, జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించినప్పుడే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్ 16 పై జగ్గంపేట సెంటర్లలో ట్రాఫిక్ సమయంలో స్టాపర్లు ఏర్పాటు చేస్తున్నాం. సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం.

– ఎస్.లక్ష్మణరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగ్గంపేట

అండర్ పాస్ మరీ చిన్నగా ఉండడంతో..



రామవరం వద్ద హైవే పైకి వెళ్లకుండా ఉండేందుకు అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. ఇందులోంచి ఆటో కూడా వెళ్లడంలేదు. ఇక్కడ అంతా అపరిశుభ్రంగా మారింది. ఇర్రిపాక, మర్రిపాక నుంచి వ్యవసాయ ఉత్పత్తులు రామవరం మీదగా జగ్గంపేట వైపు ట్రాక్టర్లు, వ్యాన్లు మీద తీసుకువెళ్లాలంటే రాంగ్ రూటే గతి. ఆ సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– కొప్పుల రామకృష్ణ, మర్రిపాక, జగ్గంపేట మండలం

దివ్యాంగులకు నేడు ఉపకరణాలు

తుని: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం దివ్యాంగులకు ఎమ్మెల్యే యనమల దివ్య ఉపకరణాలు అందజేస్తారని కమిషనర్ కె.వెంకట్రావు సోమవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అల్మికో సంస్థ సహకారంతో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 11 కేటగిరిలకు సంబంధించిన ఉపకరణాలను ఉచితంగా అందిస్తారని, విభిన్న ప్రతిభ వంతులు సదరం క్యాంపు నుంచి పొందిన ధ్రువీకరణ పత్రం నకలు, ఆధార్, రేషన్, యూఐడీ పత్రాలను తీసుకుని రావాలన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపకరణాల మంజూరుకు నేడు గుర్తింపు శిబిరం

కోటనందూరు: తుని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు సహాయ ఉపకరణాల మంజూరుకు గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జయమాధవి సోమవారం తెలిపారు. మూడు చక్రాల సైకిల్, వీల్‌చైర్స్, చంకకర్రలు, కృత్రిమకాళ్లు, కాలీపర్స్, రొలెటర్స్, చెవిమెషీన్లు, వాకింగ్ స్టిక్స్, ఎంఎస్ఈఈ కిట్లు, లెప్రసీ సోకినవారికి ఏడీఎల్ కిట్లు, సీపీ చైర్ బ్యాటరీ ఆపరేటెడ్ మూడు చక్రాల సైకిల్‌లకు సంబంధించి గుర్తింపు శిబిరం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. ఉపకరణాలకు వెళ్లే దివ్యాంగులు సదరం ధృవీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, యూడీఐడీ కార్డు ఉండాలన్నారు.

జోరుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

కోటనందూరు: గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీకి పైసా కట్టకుండా రాజకీయ నాయకులు అండదండలతో గ్రావెల్ మాఫియా జేబులు నింపుకుంటోంది. పట్టపగలే మితిమీరిన వేగంతో ట్రాక్టర్లలో గ్రావెల్‌ను తరలిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తమ కళ్లముందే గ్రావెల్‌ను తరలించేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ దందా సాగిస్తున్న గ్రావెల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ అదృశ్యం

తొండంగి: జి.ముసలయ్యపేట గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ వాకా లలిత అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యు.కొత్తపల్లి మండల అమరవల్లి గ్రామానికి చెందిన లలిత(26) ఈనెల మూడో తేదీన యథావిధిగా జీ ముసలయ్యపేట గ్రామ సచివాలయానికి విధులకు హాజరైంది. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి బయలు దేరింది. కానీ ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చెరువులకు జలకళ



పెదశంకర్లపూడిలో పొంగిపొర్లుతున్న వెంకన్నదొర చెరువు

ప్రత్తిపాడు: వర్షాపు నీటితో చెరువులు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచీ సరైన వానలు లేక సాగునీటిని అందించే చెరువులు అక్కరకు రాకుండా పోయాయి. గత వారం రోజులుగా అడపా దడపా ఓ మోస్తరు నుంచి భారీగా కురుస్తున్న వర్షాలతో చెరువులు జలకళ సంతరించుకుంది. చెరువుల కింద ఉన్న ఆయకట్టు రైతులకు జలాలు అందించేందుకు భరోసానిస్తున్నాయి. మండలంలోని నీటి పారుదల శాఖ ఆధీనంలో పెదశంకర్లపూడి వెంకన్నదొర చెరువు, ఏలూరు వెంకటపతిరాజు చెరువులతో పాటు 52 సాగునీటి చెరువులున్నాయి. వీటిలో 15 సాగునీటి చెరువులకు పుష్కలంగా నీరు చేరడంతో పొంగిప్రవహిస్తున్నాయి. ఇవి కాక పొదురుపాక ధార చెరువు, చిన పాత చెరువు, కె.కొత్తపల్లిలో చెల్లాయ్యమ్మ ట్యాంక్, చినశంకర్లపూడిలో కుదుముల టాంక్, కొత్త చెరువు, శరభవరంలో పెద్ద ట్యాంక్, చింతలూరులో రామానుజ ట్యాంక్, పెద్ద చెరువు, ధర్మవరం తమ్మయ్య ట్యాంక్ వెరసి తొమ్మిది మైనర్ ఇరిగేషన్ చెరువులున్నాయి. ఈ మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఒక్కొక్క చెరువు సుమారు వంద ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే స్థాయిలో జలాలతో కళకళలాడుతున్నాయి. వానలు పడుతున్నందున మండలంలోని మిగిలిన చెరువులకు కూడా జలాలు వచ్చి చేరనున్నాయని, చెరువుల కింద ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని ప్రత్తిపాడు నీటి పారుదల శాఖ ఏఈ ఎస్‌కే ఇబ్రహీం తెలిపారు.

అజొల్లా వినియోగంతో అనేక ప్రయోజనాలు



గొల్లలగుంటలో అజొల్లా బెడ్ తయారీపై రైతులకు, మహిళలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

జగ్గంపేట: అజొల్లా వినియోగంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని ఏపీ సీఎన్ఎఫ్ పి.రాజేష్ అన్నారు. సోమవారం మండలంలోని గొల్లల గుంట, కాండ్రేగుల గ్రామాలలో జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎన్ఎఫ్ రాజేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అజొల్లాను నత్రజనకి ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చన్నారు. అజోల్లా వల్ల వరిలో కలుపు ఉధృతి తగ్గుతుందని, పశువులకు దాణా, కోళ్లకు మేతగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనజర్ బర్రె నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు గురించి తెలుసుకోవడానికి రిలయన్స్ ఫౌండేషన్ వారి టోల్‌ఫ్రీ నెంబర్ 18004198800కి కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సిహెచ్ కృష్ణవేణి, ఆర్.వీరరాఘవ, రిలయన్స్ సిబ్బంది రమేష్‌బాబు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



బూరుగుపూడిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కిర్లంపూడి: తల్లి పాల ప్రాముఖ్యత గురించి ప్రతి తల్లీ గుర్తించాలని, పుట్టిన బిడ్డకు ముర్రిపాలు అందించాలని ఐసీడీఎస్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. బూరుగుపూడిలోని తల్లీబిడ్డ భవనంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ప్రసవమైన గంటలో శిశువుకు ముర్రుపాలు పడితే ఆ శిశువుకి వ్యాధి నిరోధిక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, ఆర్నెల్లు నిండిని పిల్లలకు అన్నప్రాసన చేశారు. సర్పంచ్ అభ్యర్థి ఆసపు భద్రి, కుంచె తాతాజీ, పాతంశెట్టి రవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కే కరిమున్నీ, కౌన్సలర్ బి.దుర్గారాణి, ఆశలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

వైభవంగా శ్రావణమాసం పూజలు



తపోవనంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి



ఎస్.అన్నవరంలో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: శ్రావణమాసం పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సోమవారం కావడంతో కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో విశేష శివ సపర్య భవానీ తాండవేశ్వర స్వామికి రుద్రాభిషేకం, రుద్ర క్రమార్చన నిర్వహించారు. శ్రావణ సోమవారం పూజ మహా శివరాత్రి వలే విశేషమైందని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి పేర్కొన్నారు. తపోవనంలో శ్రావణ మాసం ప్రతి సోమవారం అభిషేకాలు నిర్వహించునున్నట్టు తెలిపారు. ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారికి అర్చకులు నవ కలశాలతో పంచామృతాభిషేకం, ఉత్సవ ఆరంభ స్నపనం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి



వీరలంకపల్లిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోకవరం: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం అధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు అన్నారు. వీరలంకపల్లిలో రామకృష్ణాగార్డెన్స్‌లో సోమవారం ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. రసాయన పురుగు మందుల అవశేషాలు లేని పంట సాగును ప్రోత్సహించే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ మేనేజర్ షేక్ వలి, భువిజ గ్లోబల్ అగ్రిటెక్ అండ్ హార్టికల్చర్ ప్రతినిధి నరసింహారావు, ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామితో పాటు సుమారు వంద మంది రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వండి



ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

శంఖవరం: గ్రామ సచివాలయాల్లో వలంటీర్లగా పని చేస్తున్న గౌరవ వేతనం ఇప్పించాలని ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్‌కు వలంటీర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయాల వలంటీర్లు ఎంపీడీఓను కలిసి సమస్యలు వివరించారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామందని, రెండు నెలలు పూర్తి అయిన తమకు గౌరవ వేతనం ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. తమ డిమాండ్లకు న్యాయం చేయాలని కోరారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

డ్రైనేజీలు అధ్వానం



రోడ్డుపైకి చేరిన మట్టి, మురుగు నీరు



పూడిక, మొక్కలతో దర్శనమిస్తున్న డ్రైనేజీ

గండేపల్లి: తాళ్లూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా మారాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. కొన్ని చోట్ల డ్రైన్లలో మట్టి పేరుకుపోవడం, మొక్కలు పెరిగిపోవడంతో మురుగునీరు పోయే మార్గంలేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసన భరించలేకపోతున్నామని బాటసారులు, ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. రోడ్లపై మురుగునీరు ప్రవహించడంతో అంటు రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి డ్రైన్లలో పూడికను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజుచెరువు ముంపుపై అధికారులు చర్యలు తీసుకోవాలి

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున రాజుచెరువు ముంపుపై రైతులు చర్యలు తీసుకోవాలని మండల రైతు సంఘం నాయకుడు చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు రైతులు సోమవారం రాజమహేంద్రవరంలో కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. రాజుచెరువు ముంపు వలన అనేక పంట పొలాలు నీట మునిగాయని దీనివలన తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

7న ఖేలో ఇండియా రైజింగ్ స్టార్స్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఖేలో ఇండియా రైజింగ్ స్టార్స్ క్రీడాకారుల ఎంపికను ఈ నెల 7న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎంపికైన వారికి యానాంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ సెంటర్‌కు పంపుతారని చెప్పారు. 7న ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎంపికల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్‌లో బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు కాకినాడ డీఎస్ఏలో జరిగే ఎంపికలకు అర్హత పత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 89196 42248 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆక్రమణల చెరలో కోటనందూరు బస్టాండు



కోటనందూరు బస్టాండు సెంటర్లో నిలిచిపోయిన ట్రాఫిక్

వాహనాల రాకపోకలకు తప్పని అవస్థలు

కోటనందూరు: స్థానిక బస్టాండు సెంటరు ఆక్రమణల చెరలో కొట్టుమిట్టాడుతోంది. తుని, నర్సీపట్నం పట్టణాల మధ్య ఉండే ఈ బస్టాండు నిత్యం రద్దీగా ఉంటుంది. కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు సరిహద్దు ప్రాంతంలో ఉన్న కోటనందూరుకు రోజూ ఇరు జిల్లాల్లోని సుమారు 50 గ్రామాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు వివిధ కార్యకలాపాల నిమిత్తం వస్తుంటారు. దీనికి తోడు తుని-నర్సీపట్నం రోడ్డులో రోజూ వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో బస్టాండు సెంటర్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ వ్యాపారులు రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారు. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా వారు దుకాణాల్లో సరుకులన్నింటిని రోడ్డుపై పేర్చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. మరిడమ్మ గుడి ప్రాంతంలో బైక్ మెకానికర్లు అత్యంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మరీ దారుణంగా నడిరోడ్డుపైనే వాహనాలు నిలిపి మెకానిక్ చేస్తున్నారు. వీటికి తోడు సెంటరు పొడవునా ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు ఇష్టారాజ్యంగా రోడ్డుకు ఇరువైపుల నిలుపుతున్నారు. ఈ దుస్థితిలో వాహన రాకపోకలకు అవరోధం ఏర్పడి తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సాయంత్రం వేళ పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.